


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

79

(29' అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**డబ్బుకోసం** పరుగులెత్తే మానవుణ్ణి ధర్మాలకోసం పరుగులెత్తమంటే ఎలా పరుగెత్తగలడు. తెల్లారిలేచినప్పటినుంచీ ప్రతి వ్యక్తీ కుడిచేత్తో సొమ్ము సంపాదించడం ఎడమ చేత్తో గిరాటు వెయ్యడం - ఈ పనిలోనే మునిగివుంటున్నాడు ఈ వేటలో అందినవాడు తింటున్నాడు. అందనివాడు పస్తుంటున్నాడు.

అంతమాత్రంచేత అందినవాడు 'అందనివాడి'కంటే గొప్పమాత్రం కాదు ఈ ఇద్దరినీ సమానంగా చూడవలసిన కళ్ళు చాలావరకు అంధత్వంలో పడ్డాయి. అలాటి వాళ్ళకు ప్రత్యేక నేత్ర చికిత్సలిప్పుడిప్పుడే ప్రారంభమైనాయి చాలా కళ్ళల్లో పొరలు తెగినాయి 'అసలుచూపు' అందుకో కలుగుతున్నారు చాలామంది.

ప్రభుత్వం 'సేవింగ్'ల ద్వారా సిరిని ఒక లెవెల్‌లోకి తేవడానికి ప్రయత్నిస్తుంది. కాని మనస్సుల్ని ఒక్క లెవెల్‌లోకి తేవడం అనే బాధ్యత మానవుల మీదనే వుంది.

"ఏది ఆలోచిస్తున్నా, ఏ ఫలితం కోసం తాపత్రయపడాలన్నా - ముందుగా ఆర్థికస్థితి అడ్డం వస్తుంది - అందువల్ల మనస్థితి బాగుండటంలేదు" అని ఒకరు నిర్వచించారు.

***మనశ్శాంతికి పునాది గృహశాంతి***

మనశ్శాంతికి ముందుగా గృహశాంతి ఏర్పడాలి. గృహశాంతి లభించకపోవడం వల్లనే పూర్వం చాలామంది జనస్థానాలు వదిలి వనస్థలులకు పరుగులు తీశారు. ఇప్పుడలా పరుగెత్తే త్యాగం ఎవరికి వుంది? కష్టభూయిష్టమైన సంసారంలో పడికొట్టుకుంటున్నారు చాలామంది.

"బతుకొక పడవ
నడిపి చూడు
ఒక తడవా!"

- అన్నారు చాలాకాలం క్రిందట. పరిస్థితులను బట్టి నైరాశ్యంలో మునిగిన వారే! కానీ ఈనాడు ఆ పడవ ఒక్క అడుగు ముందుకు సాగకుండా నానా తిప్పలూ పెడుతోంది - సరంగుని నవ్వులపాలుచేస్తోంది.

చాలామంది జీవితాలకు 'దుర్భర' అనే బిరుదు తగిలించబడుతోంది. నిర్భయ జీవనులు చాలా తక్కువయ్యారు. ఆర్థిక స్థితి మెరుగుపడితేగానీ - ఈ దుర్భరత్వం దూరంకాదు ఇందుకోసమే ప్రభుత్వం "గరీబీ హటావో" నినాదం వెలువరించింది. ఈ నినాదం నింగిని తాకుతోందిగాని, నేలమీద ప్రాకడం లేదింతవరకూ, ధరలు ఆకాశంలో వుంటే నినాదాలు క్రిందకెలా దిగుతాయి?

కొందరు వ్యక్తులు పుట్టుకచేత బీదవారవుతూ వుంటారు. కొందరు సంపాదన కొరతవల్ల అవుతూ వుంటారు. 'అధిక ధరలు' ఒకపాటిగా వున్న వారినీ ఆ సూత్రం లేనివారినీ ఒక త్రాసులో పెట్టి తూస్తున్నాయి అలాటి 'సమత'ను సాధించినందుకు ఎంతో సంతోషిస్తున్నాయి.

అందువల్లనే ఈ 'అధికధరలు' ఆచార్య పీఠం వహించి, ప్రజలందర్నీ అంతే వాసుల్ని చేసుకుని జీవితగతుల్ని ఒకపక్క, తమతమ ఒక పక్కా, సంయమనాన్ని ఒక పక్కా - బోధిస్తున్నాయి ఎంత చెప్పినా మానవులకు ఫాషన్లమీద మోజులు తగ్గలేదు. నిరాడంబరత్వం వైపు మనస్సు మొగ్గలేదు.

గాంధీజీ చెప్పిన సిద్ధాంతాలు మనం చాలావరకు విస్మరించామనుకోండి. అందువల్ల కొంచెం బాధపడుతున్నామనుకోండి. అయినా వాటిని సహించడం తేలికవుతోంది గానీ - ఆయన సిద్ధాంతాల్ని ఇప్పుడైనా పాటించాలనే భావన కలగడంలేదు.

***కొల్లాయికట్టినా కోటీశ్వరుల మొక్కులు***

ఆయన నిరాడంబరంగా వుండమని బోధించారు - స్వయంగా అలా జీవించారు ఆయనగారి పేరు ప్రతిష్ఠలకేం కొదవ రాలేదు. ఆకు చెప్పులు తొడుక్కు తిరిగినా లోకారాధ్యుడయ్యాడు. కొల్లాయి కట్టుకుని తిరిగినా కోటీశ్వరులచేత మ్రొక్కులందించుకున్నాడు. వేరుశెనగ పప్పులు తిని బ్రతికినా - "ఎవరుసాటి?" అనిపించుకోగలిగారు.

ఐశ్వర్యం ఆత్మలో వుందిగాని ఆహార్యంలో లేదు. విశాలహృదయంలో వుందిగానీ - విలువగల ఆహారంలో లేదు. శీవి సేవా భావంలో వుందిగాని టెక్కులో కాదు అని ఆ మహనీయుడు బోధించాడు. ఆయన సాధించినదే బోధించాడు. అలాటి చిక్కుల్లో పడటం ఎందుకని అందరూ ఊరుకున్నారు.

ఇప్పుడు ఆహారం అతి ప్రియమైంది. ఆహార్యాన్ని కావాలని విపరీత స్థితికి తీసుకుపోతున్నారు. దుస్తుల్లో విలువనుబట్టి వ్యక్తుల విలువలు గ్రహించడం కష్టంగా వుంది. పస్తుల్లో వుండేవాడు కూడా 'నిస్తుల తేజోవిరాజమానుడు'గా కనిపించడానికి ఎంతో ప్రయత్నిస్తున్నాడు మరీలేనివాడు తప్ప మామూలు దుస్తుల్లో కనిపించడంలేదు.

తక్కువ తరగతివారికి తక్కువ ఖరీదు వస్త్రాలు అందాలని కాబోలు చాలామంది వీలైనంత ఎక్కువ ఖరీదుల్లోనే పోతున్నారు. దుస్తుల విలువతో తన విలువ పోల్చుకుని ఆనందిస్తున్నారు. ధరలెందుకు తగ్గుతాయి? మరింతగా చుక్కల్లోకి పోతాయి.

ఎక్కడుందీ మానవత. ఎలాటి పరిణామానికి దారి తీస్తోంది. జగత్తు అన్ని అవసరాలకన్నా మానవుణ్ణి మానవుడు అర్థం చేసుకోవలసిన అవసరం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ రోజుల్లో "తోటిమానవుడు" అనే దృష్టితో పలకరించవలసిన బాధ్యత విస్మరించవద్దని ఉద్బోధిస్తోంది. ఆకాశవాణి దానికి ప్రతిధ్వనించాలి అంతర్వాణి అప్పుడు మనస్సులు మల్లె పందిరిలల్లుకుంటాయి. మంగళగీతాలాలపిస్తాయి.

అంతేగానీ, శుష్క నినాదాల వల్లనే దేశంలో పుష్కలత్వం సంప్రాప్తిస్తుందని, మానవత మేల్కొంటుందని భావించడం అవివేకమే అవుతుంది.

***చీకటిబాటల్లో రూపాయివేట***

అసమానతతో క్రుంగిపోతున్న సంఘం అధికధరలతో మరింత దుర్భర స్థితిలో పడింది రూపాయి వేటలో జీవితపు బాటలే చీకటితో కప్పుకుని పోతున్నాయి.

జీవితమంటే రెండు విధాలు ఒకటి శారీరక పోషణ రెండవది మానవతను నిలబెట్టుకోవడం ఈ రెంటికీ భిన్నమైన వాతావరణం ఏర్పడింది.

రోజు గడవడం గొప్పగా వుంది. మోజుల మాట అలా వుంచి పొట్ట నిండటం ఘనకార్యంగా వుంది. ఫోజులమాట అలా వుంచి ధర్మాలు అందడంలేదు - ధరలూ అందటంలేదు. న్యాయం అందడంలేదు. నాణ్యతా అందడంలేదు. సంతోషం అందడం లేదు. సమృద్ధీ కనిపించడంలేదు. ఏ వ్యక్తికావ్యక్తి తనకు తానే ఎంతో బరువుగా ఫీలవుతున్నాడు. ఒక్క ఇంజను సంసారపు బండిలాగలేకుండా వుంది అందుకే సంసారానికి జంట ఇంజన్లు అవసరమనే భావన కలిగింది చాలామందిలో.

**సిరికి అంతులేని పిరికితనం.**

రూపాయల శక్తి తగ్గిపోయిందిఅని బజారువెళ్ళి ఏ వస్తువునూ తేలేక తల వంచుకుని తిరిగి వస్తున్నాయి. వాటి బలంతో బ్రతుకుతున్న మానవుడు మరింత బలహీనుడైపోతున్నాడు.

కొద్ది తావుల్లోనే కుప్పగా కూర్చోవడం ఎవరు పిలిచినా బయటికి రాక పోవడం క్రొత్తచోట్లకు పోవడమంటే బిడియపడటం ఉన్నచోటనే గడియలు బిగించుకోవడం ఇవన్నీ పిరికి లక్షణాలు. సిరివున్న వాళ్ళలో కరుకుతనం ఏర్పడుతోందిగాని - సిరికి మాత్రం అంతులేని పిరికితనం.

పైగా నల్లనయ్య హృదయం మీద నివసించడం అలవాటు గనుక బైటికి వచ్చినా చీకటి చోట్లే వెతుక్కోవడం కూడా అలవరచుకుంది తను చీకట్లో దాగి తనను దాచిన వాళ్ళ ముఖాలలో వెలుతురు గుమ్మరించడం ఆమెకు సరదా!

***చండ్ర నిప్పుల్లో జీడిగింజలు***

ధరలు పెరగడం వల్ల తన గౌరవం తరుగుతోందని ఆమె గ్రహించినట్లు లేదు. గ్రహిస్తే అందరి గృహాలలో స్వేచ్ఛగా విహరించేదే ఆమెలో కొంత సాహసం ప్రబలాలి. మానవులలో కొంత మానవత్వం ఉండాలి.

అప్పుడే ఏదైనా శాంతి. అంతవరకు 'అధికధరల' చండ్ర నిప్పులో హృదయాలు మాడిన జీడిగింజలు కావలసిందే

Post your comments